వైద్యులు అందుబాటులో ఉండాలి

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: విష జ్వరాలు విజంభిస్తున్న నేపథ్యంలో వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జెడ్పిటిసి దీసరి. గంగరాజు కోరారు. స్థానిక విలేకరులతో ఆయన గురువారం మాట్లాడుతూ, మండలంలోని అనంతగిరి, లుంగపర్తి, పిన్నకోట, భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాలలో చిన్నపిల్లల నుండి పెద్దలు సైతం దగ్గు, జలుబు, విష జ్వరాలతో బాధ పడుతున్నారన్నారు. సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాలలో ఆరోగ్య సూత్రాలపై గిరిజన ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కోవిడ్ మళ్లీ విజంభిస్తున్న తరుణంలో మరింత అప్రమంతంగా ఉండవలసిన అవసరం ఉందన్నారు. ఈ పరిస్థితలను దృష్టిలో పెట్టుకుని వైద్యులు, సిబ్బంది సకాలంలో స్పందించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

గిరిజనులకు చింత

- శ్రమించి సంతకు తీసుకొస్తున్నా కానరాని గిట్టుబాటు ధర
- కిలో రూ.27నుంచి 30కి చింతపండు అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు - నష్టపోతున్న గిరిజనులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గిరిజనులు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి చింతపండును మండల కేంద్రంలోని వారపు సంతకు తీసుకు వస్తున్నా కనీస ధర లభించ లేదు. కనీస దారి ఖర్చులు కూడా రాక పోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గిరిజనులు చింతపండు సేకరణకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చెట్ల నుంచి చింతపండను సేకరించేందుకు తీవ్ర వెతలు పడతారు. చెట్లు ఎక్కి రాలిన చింతపండు బొట్లను ఒలిచి పండును ఏరుతారు. అక్కడి నుంచి చింతపండును కావిడి, బుట్టల్లో జీపులు, కాలినడకన హుకుంపేటకు ఎంతో శ్రమించి తీసుకొస్తారు. ఇంత శ్రమించి వారపు సంతకు తీసుకు వస్తే కిలో రూ.27 నుంచి రూ.30లకు మాత్రమే ధర లభిస్తోంది. దీంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు. వారు పడిన కష్టానికి ఫలితం రాకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు.
హుకుంపేటలో ప్రతి శనివారం వారపు సంత జరుగుతుంది. మండలంలోని జార్రకొండ, గన్నేరు పుట్టు, చికు మదుల, భీమ వరం, అండిభ, మెరక చింత, రాప, దుర్గం, గత్తుం, బూర్జ, తిగలవస, మెట్టుజోరు, తడిగిరి, బి.బొడ్డ పుట్టు, సూకూరు, గూడ, రంగశీల, కొట్నాపల్లి, పట్టాం, తాడే పుట్టు, హుకుంపేట, శోభకోట, తదితర పంచాయతీ పరిధిలోని గిరిజనులు చింతపండును సేకరిస్తారు. ఈ పంచాయతీల గిరిజనులు ప్రతి శనివారం హుకుంపేటలో జరిగే వారపు సంతలో అమ్మకాలు చేపడతారు. తీరా ఇంత శ్రమించినా కిలో చింతపండు రూ.27 నుంచి 30వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. దీంతో, గిరిజనులు నష్ట పోతున్నారు.
పాడేరు డివిజన్ పరిధిలోని గిరిజన సహకర సంస్థ (జిసిసి) వారపు సంతలో దళారీ వ్యవస్థను అదుపు చేయాల్సి ఉంది. మోసాలకు తావు లేకుండా చేస్తామని జిసిసి కేవలం ప్రకటనకు మాత్రమే పరిమితం అవుతుందని గిరిజన రైతులు పేర్కొన్నారు. జిసిసి అధికారులు స్పందించి కిలో చింతపండును రూ. 100 నుంచి 150లకు కోనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. జీసీసీ ద్వారా గ్రామాల్లో పర్యటించి కొనుగోలు చేసినట్లయితే వారపు సంతలో గిరిజనులు అమ్మకానికి తేరు. వారపు సంతలో ఎక్కువగా మోసాలు జరగవు. గత్యంతరం లేని పరిస్థితిలో సంత తీసుకొచ్చి

గ్రామాల్లో కొనుగోలు చేయాలి

ప్రభుత్వం జోక్యం చేసుకొని ఐటీడీఏ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో గ్రామాల్లోకి వెళ్లి చింత పండు కోనుగోలు చేయాలి. కష్టపడి పండిచిన చింత పండుకు కనీసం ధరలు లేక పోవడంతో నష్టపోతున్నాం. చింతపండు ఏరివేత దగ్గర నుంచి వాటిని సంతలకు తీసుకెళ్లే వరకూ ఎంతో శ్రమ దాగి ఉంటుంది. అధికారులు స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలి

శతకా బొంజుబాబు
తాడేపూట్టు గ్రామం

కష్టానికి ఫలితం లేదు

ఎంతో కష్ట పడి చింతపండును సేకరిస్తున్నా తగిన ఫలితం లేకుండా పోయింది. గతి లేక వారపు సంతకు తీసుకు వస్తున్నా కనీస ధర లభించ లేదు. దీంతో తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. దళారులు అంతా కలిసి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో, కష్టించి సంతకు తీసుకోస్తున్నా ఫలితం లేకుండా పోతుంది.

కిల్లో సుందర్‌రావు
ముల్లుమెట్ట, తడిగిరి పంచాయతీ

గిట్టుబాటు ధర చెల్లించాలి

గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. గిరిజన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలి. పూర్తిగా ప్రభుత్వం, అధికారులు బాధ్యత వాహించి గిరిజనులు పండించిన పంటలకు కనీస ధరలకు కొనుగోలు చేయాలి. గిట్టుబాటు ధర కల్పించాలని గిరిజనసంఘం ఆద్వర్యాన ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోక పోవడం సరికాదు.

కిల్లో రామారావు
గిరిజన సంఘ మండల అధ్యక్షులు

మన్యంలో మండుతున్న ఎండలు

ఉక్కపోతతో గిరిజనులు విలవిల

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మన్యం ప్రాంతంలో ఎండల తీవ్రత కొనసాగుతుంది. ఈ ఏడాది మన్యంలోనూ ఎండలు తీవ్రంగానే ఉన్నాయి. మైదాన ప్రాంతానికి పోటీగానే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. గురువారం సైతం ఎండ ప్రతాపం చూపింది. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవుతోంది. నాలుగు గంటల వరకు వేడి ప్రభావం కొనసాగుతోంది. మధ్యాహ్నం వేళలో ఎండ తీవ్రతకు బయటకు రావడానికి జనం భయపడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో గొడుగులు వేసుకుని బయటకు వెళుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో ఏజెన్సీ వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.
ఊహించని రీతిలో ఎండల తీవ్రత ఉండడంతో ఉక్కపోతతో జనం విలవిల్లాడుతున్నారు. సాయంత్రం 6 గంటలైనా వేడిగాలి వెంటాడుతూనే ఉంది. పిల్లలు, వృద్దులు అల్లాడిపోతున్నారు. గర్భిణులు, బాలింతలు ఎండల వేడిమికి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. తప్ప లేని పరిస్థితిలో బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. లేదంటే వడదెబ్బ మహమ్మారి బారిన పడే ప్రమాదం లేకపోలేదు. రక్షిత మంచినీరే కాదు తరచూ మజ్జిగ వంటివి క్రమం తప్పకుండా తీసుకుంటే ఆరోగ్యానికి శ్రేయస్కరమని వైద్యులు చెబుతున్నారు. ఎండలు తగ్గే వరకూ గిరినులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచింస్తున్నారు.

గొడుగు నీడన సంతలో కూర్చున్న గిరిజనులు

డోలీమోతతో మృతదేహాన్ని తీసుకొస్తున్న గిరిజనులు

5 కిలోమీటర్లు డోలీమోతతో మృతదేహం తరలింపు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని బూదరాళ్ళ పంచాయతీ పరిధి కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కొర్రా లక్ష్మి ఆకస్మికంగా మృతి చెందగా, ఆమె మృతదేహాన్ని ఐదు కిలోమీటర్ల మేరకు డోలీమోతతో గ్రామానికి తరలించిన వైనం గురువారం చోటుచేసుకుంది. కొత్తపల్లి గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కొర్రా లక్ష్మి మూడు వారాల క్రితం మండలంలోని కొమ్మిక గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్ళింది. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో నీరసంగా ఉందని చెప్పడంతో అక్కడి బంధువులు వెంటనే ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యలో రాత్రి 11.30 గంటల సమయంలో మృతి చెందింది. లక్ష్మి మృతదేహాన్ని ఆమె స్వగ్రామమైన కొత్తపల్లికి తరలించేందుకు.. కొమ్మిక నుండి చింతవానిపాలెం వాటర్ ఫాల్స్ జంక్షన్ వరకు ఒక ప్రైవేట్ వాహనంలో తీసుకొని వెళ్లారు. అక్కడి నుండి రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలీ కట్టి సుమారు 5 కిలోమీటర్లు మేర కాలినడకన మోసుకొని కొత్తపల్లి గ్రామానికి తీసుకెళ్లారు. కొత్తపల్లి గ్రామానికి రహదారి లేకపోవడంతో అనారోగ్యానికి గురయ్యేవారిని, గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుందని, డోలీమోతతో తీసుకెళుతున్నామని కొత్తపల్లి గ్రామానికి చెందిన త్రినాథ్, సుందరరావు, శ్రీను, సత్తిబాబు, బోడిరాజు, సింహాచలం, కొండబాబు, సంతోష్, సిద్దేష్ తెలిపారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. మరణించిన ఆశా కార్యకర్త లక్ష్మికి భర్త సన్యాసిరావు, ఇద్దరు కుమారులు ఉన్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కుమార్తె మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి చిన్నమ్మి

మాట్లాడుతున్న అప్పలనర్స

అడవి నుంచి ఆదివాసీల గెంటివేతకు కుట్ర

-గిరిజన చట్టాలు, హక్కులను కాలరాస్తున్న మోడీ సర్కారు

- 24న బహిరంగ సభను జయప్రదం చేయాలి

-సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గిరిజన చట్టాల్ని, హక్కుల్ని కాలరాసి ఆదివాసీలను అడవి నుంచి గెంటి వేయాలని చూస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస ధ్వజమెత్తారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక గిరిజన హక్కుల్ని, చట్టాలను బలహీనపరుస్తూ అటవీ సంరక్షణ చట్టాన్ని సవరించి ఆదివాసీలను అడవి నుంచి గెంటివేయాలని మోడీ సర్కార్ కుట్ర చేస్తోందని విమర్శించారు. ఆదివాసీలను గెంటివేసి అడవిని కార్పొరేట్ కంపెనీలకు అప్పగిం చాలని చూస్తోందన్నారు. 24న పాడేరు లో నిర్వహించే బహిరంగ సభ ను జయప్రదం చేయాలని పిలునిచ్చారు. బిజెపి చర్యలను ఖండిస్తూ దేశ వ్యాప్తంగా సిపిఎం, సిపిఐలు కలిసి ప్రచార భేరీ కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీలేరు నుంచి ప్రారంభించి పాడేరు నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లో నిర్వహిస్తున్న పాదయాత్ర ప్రచార భేరీ కార్యక్రమం ముగింపు రోజున పాడేరులో ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, దీనికి ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణమూర్తి హాజరవుతున్నారని తెలిపారు. ఈ ప్రచార బేరిలో భాగంగా విస్తతంగా ప్రచారం సాగించి ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్, సిపిఎం మండల కార్యదర్శి ఎల్. సుందరరావు, సీపీఐ మండల కార్యదర్శి కూడ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీలను అందజేస్తున్న సంఘం అధ్యక్షురాలు కృష్ణకుమారి

ప్రెస్ క్లబ్‌కు కుర్చీల వితరణ

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: స్థానిక ప్రెస్ క్లబ్‌కు మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళ విబాగా అధ్యక్షురాలు కే.కృష్ణకుమారి గురువారం నాలుగు కుర్చీలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, సమాజంలో పాత్రికేయుల పాత్ర చాలా కీలకమైనదని, నిత్యం ప్రజా సమస్యలను వెలికితీసి ప్రభుత్వానికి, అధికారులకు తెలియపరచి పరిష్కరిం చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ, జిల్లా నాయకుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దేశ సంపదను ప్రైవేటుపరం కానివ్వం

ప్రచార భేరిలో సిపిఎం నాయకులు ప్రసన్నకుమార్

రేపాకలో ప్రచార భేరి చేపడుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

డుంబ్రిగుడ మండలంలో ప్రజలను కలుసుకున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కూనవరం

కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా దేశ సంపదను ప్రైవేటుపరం కానివ్వమని సిపిఎం నాయకులు ప్రసన్నకుమార్ అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీల పిలుపు మేరకు నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమం మండలంలోని రేపాక గ్రామంలో గురువారం జరిగింది. ఇందులో పాల్గొన్న ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని అధికారం నుండి దింపి బుద్ధి చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోలవరం పరిహారం ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తూ ఇంకెన్నాళ్లు పబ్బం గడుపుతుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యాదర్శి పాయం సీతారామయ్య, నాయకులు మడకం జ్యోతి, బాబు బొర్రయ్య, మడకం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక : సిపిఎం ఆధ్వర్యాన ప్రచార భేరి కార్యక్రమం గురువారం మండలంలోని గోమ్ముకొత్త గూడెంలో జరిగింది. సిపిఎం నాయకులు వ్యవసాయ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రచారభేరి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని విమర్శించారు. రైతులకు రుణ మాఫీ చేయని ప్రభుత్వాలు, కార్పొరేట్లకు లక్ష కోట్ల రూపాయలు మాఫీ చేస్తున్నాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మే 4న చింతూరులో జరిగే బహిరంగ సభకు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు దేగల మాధవరావు, ఆకిశెట్టి రాము, కాపవరం శాఖ కార్యదర్శి తోటకూరి రాంబాబు, గంజి చిన్న పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని ములకలపల్లి పంచాయతీ పరిధి కొత్తపేటలో ప్రచార భేరి కార్యక్రమంలో భాగంలో సిపిఎం నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంచారు. ఉపాధి హామీ ప్రదేశాలను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు కుంజ నాగిరెడ్డి, వడ్లాది రమేష్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శీలం శేఖర్, శీలం నారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

డుంబ్రిగూడ : గిరిజన, ప్రజా, కార్మిక వ్యతిరేక మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు పిలుపునిచ్చారు. మండలంలోని ఆరమ పంచాయతీ బడిమెల, గుంటగన్నెల పంచాయతీ కూనపుట్టు గ్రామాల్లో గురువారం ప్రచార బేరి జీపు జాతా నిర్వహించారు. సిపిఎం నాయకులకు ఆ గ్రామంలో గిరిజనులు సంప్రదాయ బద్ధంగా బొట్టులు పెట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తూ హైడ్రోఫవర్ ప్రాజెక్టు నిర్మాణానికి బిజెపి పూనుకుంటుందని తెలిపారు. పాడేరులో జరిగే బహిరంగ సభకు అధిక సంఖ్యలో గిరిజనులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.సూర్యనారాయణ, పి.సత్యనారాయణ, పి.దొంబు, వి మహేశ్వరావు, జగన్నాథం, కే,అర్జున్, పి.మోహన్‌దాస్, పి.డోయితరి, గిరిజనులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : సీపీఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార బేరిలో భాగంగా ఈనెల 25న అరకులోయలో నిర్వహించే భారి బహిరంగ సభను విజయవంతం చేయాలని మాడగడ పంచాయతీ నందిగుడ, చొంపి గ్రామంలో నాయకులు ప్రచారం చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కూలీలు పని చేస్తున్న ప్రాంతంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, మతోన్మాద బిజెపిని అధికారం నుండి గద్దె దించి దేశాన్ని కాపాడుకోవాలని చెప్పారు. స్టీల్ ప్లాంట్, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, రైల్వే వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు కేంద్రం పూనుకుంటోందని విమర్శించారు. గ్రామ సభ, పిసా కమిటీ తీర్మానం లేకుండా హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం ఎలా చేస్తారని, తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గొమ్ముకొత్త గూడెంలో పోస్టర్లను చూపుతున్న రైతులు, సిపిఎం నాయకులు

అరకులోయ మండలంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

అనారోగ్యంతో గిరిజన విద్యార్థి మృతి

-తల్లిదండ్రులను పరామర్శించిన గిరిజన సంఘం నేతలు

- వైద్యం అందకపోవడం వల్లే మృతి చెందినట్లు వెల్లడి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

వై.రామవరం మండలం కోట ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న కోట గ్రామం అద్దరివీధికి చెందిన బట్ట లక్ష్మి (13) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. వారం రోజుల పాటు జ్వరంతో బాధపడుతుండగా ఎటువంటి వైద్యం అందకపోవడంతో ఫిట్స్ వచ్చి మృతి చెందినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోత రామారావు, జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి బాలిక తల్లిదండ్రులను పరామర్శించి, ఓదార్చారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాలిక తల్లిదండ్రులు బట్ట దేవి రెడ్డి, చిన్నమ్మి మాట్లాడుతూ వారం రోజుల నుండి జ్వరంతో పాటు పాఠశాల మెట్ల మీద పడి తలనొప్పితో బాధ పడినట్లు తెలిపారు. దీనిపై పాఠశాల సిబ్బందిని వివరణ కోరగా రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరైందని, ఒక్క రోజు మాత్రమే పాఠశాలకు రాలేదని, ఏం జరిగిందో అర్ధం కావడం లేదని తెలిపారు.

వివరాలు అడిగి తెలుసుకుంటున్న రామారావు

ఈ సందర్భంగా గిరిజన సంఘం నేతలు రామారావు, సిరిమల్లిరెడ్డి మాట్లాడుతూ సదరు విద్యార్థిని లక్ష్మిది పాఠశాల ఉన్న గ్రామమే కావడంతో ఆమె ఇంటికి వెళ్లిపోవడంతో పాఠశాల సిబ్బంది ఆమె బాగోగులు పట్టించుకోలేదని అర్థమవుతుందని తెలిపారు. సకాలంలో వైద్యం అంది ఉంటే లక్ష్మి బతికేదని పేర్కొన్నారు. పివిటిజి కొండ రెడ్డి తెగకు చెందిన అత్యంత వెనుకబడిన పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు అమాయకత్వం వల్ల వైద్యం చేయించలేకపోయారని, పాఠశాల అధికారులు కూడా పట్టించుకోలేదని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, గిరిజనుల అవగహన రాహిత్యం, అమాయకత్వం వల్ల ఇటువంటి అనేక మరణాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి వైద్యం అందిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, వారం రోజుల పాటు అనారోగ్యంతో బాధపడుతుంటే ఎందుకు వైద్యం అందించలేదని ప్రశ్నించారు. అనేక గిరిజన కుటుంబాలు డబ్బుల్లేక వైద్య సేవలు పొందకపోవడం వల్ల మరణిస్తున్నారని, ఇలాంటి కుటుంబాలను ప్రభుత్వం, ఐటిడిఎలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించాలని, గిరిజనుల మరణాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రమణ, గ్రామస్తులు సిహెచ్.చిన్నారెడ్డి, బి.రామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి విద్యుత్ కార్యాలయ 11కెవీ, జడ్డంగి ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల వెంబడి ఉన్న చెట్లను, కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్డంగి ఫీడర్ పరిధిలోని మారేడుబాక పంచాయతీ మంగంపాడు, రత్నాలు పేట, మారేడుబాక తదితర గ్రామాలకు చెందిన వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

గిరిజన మహిళలతో మాట్లాడుతున్న శాంతకుమారి

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: మండలంలోని కించుమండ సంత బయలులో వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర చైర్పర్సన్ పి.శాంతకుమారి డిమాండ్ చేశారు. గురువారం ఆమె ఆ గ్రామంలో సందర్శించారు. బిందెలతో మోసుకొస్తున్న గిరిజన మహిళలతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సంతబయలు వీధిలో తాగునీటి సౌకర్యం లేక గ్రామస్తులు సుమారు కిలోమీటర్ దూరంలో గెడ్డ నుంచి తాగునీటిని తీసుకొస్తున్నారన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిహెచ్ సాయిబాబా, కార్యకర్తలు పద్మ, మోహన్ రావు పాల్గొన్నారు.

మావోయిస్టు నేత నాగభూషణ్‌కు బెయిల్

విశాఖ జైలు నుంచి విడుదలైన మావోయిస్టు నేత

ప్రజాశక్తి - ఆరిలోవ : మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు చడ్డా నాగభూషణ్ గురువారం విశాఖ కేంద్ర కారాగారం నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. చడ్డా నాగభూషణ్‌పై 59 కేసులున్నాయి. కొన్ని కేసుల్లో సరైన ఆధారాలు లేకపోవడంతో న్యాయస్థానం కొట్టేయగా, మిగిలిన 49 కేసులకు సంబంధించి 20 కేసుల్లో బెయిలు మంజూరు కావడంతో గురువారం జైలు నుంచి విడుదలయ్యారు. హుకుంపేట మండలానికి చెందిన చట్టా నాగభూషణ్ అలియాస్ మల్లన్న 9వ తరగతి చదువుతుండగానే మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లారు. వివిధ కేసుల్లో ఒడిశా జైలులో ఆరేళ్ళు, విశాఖలో మూడేళ్ళు, రాజమండ్రి కేంద్రకారాగారంలో రెండేళ్ళు, తిరిగి విశాఖ కేంద్రకారాగారంలో మరో ఏడాది జైలు శిక్ష అనుభవించారు. విశాఖ కేంద్రకారాగారం నుంచి బెయిల్‌పై విడుదలైన చడ్డా నాగభూషణ్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా కుటుంబానికి దూరంగా ఉన్నానని, ఇపుడు వారిని కలుసుకోబోవడం ఆనందంగా ఉందన్నారు. బెయిల్‌కు సహకరించిన లాయర్లకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటానన్నారు. బెయిల్ మంజూరుకు సహకరించిన వారికి చెడ్డపేరు తీసుకురానన్నారు.

పారిశుధ్య నిర్వహణ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-సింహాచలం: ఈ నెల 23న సింహాద్రి అప్పన్న చందనోత్సవం సందర్భంగా ఆలయం వద్ద చేపట్టే పారిశుధ్య నిర్వహణ ఏర్పాట్లను జివిఎంసి కమిషనర్ సిపి సాయికాంత్ వర్మ గురువారం పరిశీలించారు 98వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా అసంపూర్తి బిఆర్‌టిఎస్ పనులు, వార్డు అభివృద్ధిపై కమిషనర్‌ను వార్డు కార్పొరేటర్ పివి.నరసింహం కోరగా, సానుకూలంగా స్పందించారు. చందనోత్సవం రోజున భక్తులకు ఇబ్బంది కలగకుండా పారిశుధ్య పనులను చేపట్టాలని ఆదేశించారు. జెడ్‌సి మల్లునాయుడు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

పాడేరులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తదితరులు

మారేడుమిల్లిలో కేకు కట్ చేస్తున టిడిపి నేతలు

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రానికి సుపరిపాలన అందించడంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మరెవరు సాటిలేరని పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి కొనియాడారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను గురువారం పాడేరు నియోజకవర్గ కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులతో ఘనంగా నిర్వహించారు. ముందుగా టిడిపి నాయకులు మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో అభిషేకం నిర్వహించారు. కేక్ కట్ చేసి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ఆమె జిల్లా ఆస్పత్రిలో రోగులకు పాలు రొట్టె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయిందని విమర్శించారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు వైస్ ఎంపీపీ గంగ పూజారి శివకుమార్, నాయకులు రోబ్బి రాము, గబ్బడ సింహాచలం, కొట్టగుల్లి రమేష్ నాయుడు, మధు, కిల్లు రాధాకృష్ణ పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను తెలుగు యువత అధ్యక్షుడు ఎల్ త్రినాథ్ (చిన్ని) అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ పేట సర్పంచ్ అశోక్‌పాల్గొన్నారు.

మారేడుమిల్లి : టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు గురుకు శేషు కుమార్, ఉపాధ్యక్షులు కర్రి సన్యాసిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదట పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భీశెట్టి అప్పాజీ, షేక్ మస్తాన్. మండా రత్నాజీ, కాశిగాని వంశీకృష్ణ, పాము రాము, డొక్కా రత్నాకర్, కత్తుల వెంకటేశ్వర రెడ్డి, సాగర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విఆర్.పురం : చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రహీం, టిడిపి నాయకులు బురక కన్నారావు, ముత్యాల రాంబాబు, భాగ్యలక్ష్మి, సవలం రాజేంద్ర ప్రసాద్, బొర్రా నరేష్ కుమార్, బీరక సూర్య ప్రకాష్‌రావు, మల్లికార్జున్‌రావు, ముత్యాల చంద్రశేఖర్, కొడేశల దుర్గారావు, రేవు సింహాచలం, ముత్యాల రమేష్, బూడిద దుర్గ, వడ్డాణపు సత్యానారాయణ, బొర్రా సూరి పాల్గొన్నారు.


పెదబయలులో త్రినాథ్ ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు

విఆర్.పురంలో చంద్రబాబు జన్మదిన వేడుకల్లో టిడిపి నేతలు

మే డే సాంస్కృతిక మేళాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా ఈ నెల 30 నుంచి వచ్చేనెల 2 వరకు మూడురోజులపాటు ఉక్కునగరంలో నిర్వహించే మే డే సాంస్కృతిక మేళాను జయప్రదం చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు పిలుపునిచ్చారు. గురువారం ఉక్కునగరం సిఐటియు కార్యాలయం వద్ద స్టీల్ సిఐటియు, మహిళా సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గంగారావు

ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపరిచి, పోరాటానికి సమాయత్తం చేయడమే లక్ష్యంగా మేడే సందర్భంగా ఈ సాంస్కృతిక మేళాను నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, స్టీల్ సిఐటియు నాయకులు పుల్లారావు, ఆర్ వెంకటరావు, కె బాలశౌరి, కె సత్యానారాయణ, చిరంజీవి మహిళా సంఘం నాయకురాలు కె వేణు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ముమ్మరంగా స్ప్రేయింగ్

పాడేరు, పెదబయలులులో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న న్న సిబ్బంది

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలో ఎపిడమిక్ సీజన్ దృష్ట్యా మలేరియా నియంత్రణకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ముమ్మరంగా పిచికారి పనులు చేపడుతున్నారు. మండలంలోని చింతలవీధి సచివాలయం తలారిసింగి, లగిసపల్లి పంచాయతీ లగిసపల్లి గ్రామంలో గురువారం పిచికారి పనులు నిర్వహించారు. పిచికారి చేయడానికి రెండు రోజులు ముందుగానే సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులందరూ సహాయ సహకారాలు అందిస్తున్నారు.ఇంటి పక్కన మురుగు కాలువలు ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లు సెట్టి నాగరాజు, ఎస్పీ పడాల్, ఆశ వర్కర్లు ఈశ్వరమ్మ, పార్వతమ్మ, కళావతి పాల్గొన్నారు.

పెదబయలు రూరల్: పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కుంతుర్ల, పెదకోడపల్లి, పర్రెడ పంచాయతీల్లో మొదటి విడత పిచికారి పనులు ప్రారంభించామని వైద్యాధికారి సింధూరం పడల్ తెలిపారు. మండలంలోని 28 గ్రామాల్లో ఇంటి లోపల పిచికారి చేస్తున్నామన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దోమ తెరలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమ, సూపర్వైజర్ సింహాచలం, హెల్త్ అసిస్టెంట్ వీరన్న, ఏఎన్ఎం వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

గీతంలో ఆరిజోనా స్టేట్ వర్సిటీ బృందం

అరిజోనా వర్సిటీ బృందాన్ని సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : అమెరికాలోని ప్రసిద్ధ విశ్వవిద్యాలయం ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ అకడమిక్ నిపుణుల బృందం గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాయాన్ని సందర్శించింది. ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పాట్ ఫిలాన్, విద్యార్థి విభాగం డైరక్టర్ మైక్ మ్యాక్ బ్రైడ్, విభాగం సహాయ డైరక్టర్ అర్జుహన్ కెవాక్, డిజైన్, ఆర్ట్స్ విభాగం ప్రొఫెసర్‌లు డాక్టర్ సంగునెట్టి, డాక్టర్ సన్నిక్యో తదితరులు గీతంలోని విభాగాలను పరిశీలించారు. అనంతరం గీతం విసి ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరక్టర్ ప్రొఫెసర్ మోహన్, అంతర్జాతీయ విద్యార్థి విభాగం డైరక్టర్ డాక్టర్ కె.పి.కిషన్, గీతం ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్‌లు, డీన్‌తో సమావేశమై బోధన, పరిశోధన అంశాలపై చర్చించారు . ఈ సందర్భంగా గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం మాట్లాడుతూ ప్రపంచశ్రేణి విద్యాలయంగా గీతంను తీర్చిదిద్దడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను వివరించారు. గీతంలో బోధన, పరిశోధనలు, కోర్సుల వివరాలను తెలిపారు. గీతం విద్యార్థుల ఉన్నతికి ఉపయోగపడే విద్యాసంస్థలతో మేధో సంబంధాలను నెలకొల్పడానికి ఆసక్తితో ఉన్నామని తెలిపారు.అనంతరం ఆరిజోనా స్టేట్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కోర్సులు, పరిశోధన అవకాశాలను విద్యార్థులతో ముఖాముఖిలో వివరించిన ఆవర్సిటీ ప్రతినిధులు, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

తాగునీటి బోరును ప్రారంభిస్తున్న మిషన్ ఫియల్ సంస్థ ప్రతినిధులు, సిపిఎం నేతలు

తాగునీటి బోర్లు ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు మండలం కల్లేరు రాఘవయ్య గుంపు, మదుగూరు కారం సుబ్బారావు గుంపు గ్రామాల్లో రెండు తాగునీటి బోర్లను గురువారం మిషన్ ఫియల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, సిపిఎం నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, కుంజా సీతారామయ్య, పల్లపు వెంకట్ మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి బోర్లను ఏర్పాటు చేసిన మిషన్ ఫియల్ సంస్థ యాజమాన్యానికి, ప్రతినిధి విమల్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా ఆయా గుంపులలో ఉన్న మొత్తం 40 కుటుంబాల వారు మంచినీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పక్కనున్న సీలేరు నదిపై ఆధారపడివలసి వస్తుందని, తాగునీటిని కిలోమీటర్ల దూరంలో ఉన్న బోరుబావుల నుంచి తెచ్చుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. సమస్యను మిషన్ ఫియల్ సంస్థకు దృష్టికి తీసుకెళ్లిన సిపిఎం నాయకులకు, మంచినీటి బోర్లు ఏర్పాటు చేసిన మిషన్ ఫియల్ సంస్థకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ ఫియల్ సభ్యులు లక్ష్మణ్, అభి, ఉదయ్, కల్లేరు గ్రామస్తులు సోడే రాఘవయ్య, రాములమ్మ, రెడ్డి, కారం శ్రీరాములు, ముత్తమ్మ, పాండు సీతమ్మ, మధుగూరు గ్రామస్తులు కారం సుబ్బయ్య, కారం వినోద్, సీతారామయ్య, రాజమ్మ, కుమారి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్యపై వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పిఎఫ్ సొమ్ము సకాలంలో క్రెడిట్ కాని కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఆ సమస్యను తక్షణం పరిష్కరించాలని యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చినబ్బాయ్ గురువారం సాయంత్రం ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సిఇఒ శ్రీరామమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకూ ఉద్యోగుల పిఎఫ్ నిధుల సమాచారం ఆన్‌లైన్ కాలేదని, 2010 నుంచి ఉద్యోగుల జీతాలు ఆన్‌లైన్‌లో ప్రభుత్వం చెల్లిస్తున్నప్పటికీ, ఇంకా ఆఫ్‌లైన్‌లోనే మిస్ క్రెడిట్లు షెడ్యూల్స్ తీసుకోవడం వల్ల సకాలంలో పిఎఫ్ సొమ్ము క్రెడిట్ కావడం లేదని అన్నారు. ఈ నేపథ్యంలో సమస్యకు ఆన్‌లైన్‌లోనే ఒక పరిష్కారం చూపాలన్నారు. మిస్ అయిన షెడ్యూల్స్ సమాచారం సంబంధిత అధికారులకు, ఆఫీసులకు సకాలంలో తెలియజేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని డిడిఒలతో మాట్లాడి పిఎఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన జెడ్‌పి సిఇఒ హామీ ఇచ్చారు.

'ఉక్కు'ను ప్రైవేటీకరిస్తే ఊరుకోం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రజల ఆకాంక్షను గుర్తించి విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరణ చేయకుండా బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు పడాల రమణ హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 748వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లకుపైగా కార్మికులు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నేతలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమం సాగిస్తున్నారని, దీనిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరిచి కేంద్రంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

సుబ్బయ్య ఆశయాలను కొనసాగిద్దాం

స్థూపం ఆవిష్కరణ సభలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- చింతూరు

సిపిఎం నాయకునిగా నిత్యం ప్రజల కోసం పనిచేస్తూ, సర్పంచ్‌గా గూడూరు పంచాయతీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం చివరి వరకు కృషి చేసిన అమరజీవి కామ్రేడ్ సోడి సుబ్బయ్య మరణించినా ప్రజల్లో జీవించే వున్నారని సిపిఎం నాయకులు కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే సుబ్బయ్యకు మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. మండలంలోని గూడూరు గ్రామంలో అమరజీవి సోడి సుబ్బయ్య స్థూపాన్ని గురువారం సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. అనంతరం మడకం రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం మండల నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, కుంజా సీతారామయ్య, పల్లపు వెంకట్ మాట్లాడారు. సుబ్బయ్య మొదటి నుండి పార్టీ పట్ల అంకిత భావంతో ప్రజాపోరాటంలో చురుకుగా పాల్గొనేవారని తెలిపారు. చింతూరు ఆఫీస్ కార్యదర్శిగా పని చేస్తూ మండలంలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఏ సమస్య మీద వచ్చిన స్పందించి అధికారుల దగ్గరకు తీసుకువెళ్లి సమస్య పరిస్కారం కోసం కృషి చేసేవారని గుర్తు చేశారు. గూడూరు సర్పంచ్‌గా అత్యధిక మెజారిటీతో గెలిచి పంచాయతీలోని తాగునీరు, విద్యుత్, రోడ్లు, విద్య తదితర సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. అనారోగ్యంగా ఉన్నా చివరి వరకు ప్రజల కోసం, పార్టీ కోసం పరితపించిన మంచి నాయకుడు సుబ్బయ్య అని పేర్కొన్నారు. అతి నిరాడంబరుడైన సుబ్బయ్య మన నుండి దూరం కావడం బాధాకరమని, ఆయన లేని లోటు పూర్చలేనిదని తెలిపారు. సుబ్బయ్య కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బయ్య అన్న రామయ్య, నాయకులు మడకం చిన్నయ్య, మడకం ముత్తయ్య, సున్నం నెహ్రు, తెల్లం చిన్నయ్య, లక్ష్మయ్య, కన్నారావు, కలుముల మల్లేష్, రాంబాబు, రమణ, శేషు, కాంతమ్మ, తిరుపతమ్మ, మణి, భూమిక, సరిత తదితరులు పాల్గొన్నారు.

నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు

ప్రజాశక్తి - లీగర్ రిపోర్టర్ : వార్షిక సాధారణ బదిలీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గురువారం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీలలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలకు స్థాన చలనం జరిగింది. నగరంలోని ఆరో మెట్రోపాలిటీ మెజిస్ట్రేట్ కం రైల్వే కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.శ్రీనివాస్ బాబును జూనియర్ సివిల్ జడ్జిగా గన్నవరానికి బదిలీ చేశారు. ఇదే స్థానంలో జూనియర్ సివిల్ జడ్జిగా చిత్తూరులో విధులు నిర్వహిస్తున్న కె.అనురాగ్ అలియాస్ ఎంఎఎస్‌కె అనూష బదిలీపై వస్తున్నారు. విశాఖపట్నంలో ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న సాయి కృష్ణను కొవ్వూరు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. ఈ స్థానంలో గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వి.గంగాభవాని బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం నర్సీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న రెడ్డి ప్రసన్నను ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా రాజమండ్రికి బదిలీ చేశారు ఇదే స్థానంలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాసరావు తూర్పు గోదావరి నుంచి బదిలీపై వస్తున్నారు. నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా అనకాపల్లిలో విధులు నిర్వహిస్తున్న పి.ప్రదీప్‌ను అనకాపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు అనకాపల్లిలో ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.విజయ్ చందర్ కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. చోడవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న డి.ఉమాదేవి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా చిత్తూరుకు బదిలీ అయ్యారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ సార్ల లలిత కుమారి అన్నారు. గురువారం ఆమె మండలంలోని పాములేరు పంచాయితీ పరిధి కాకూరు, ఎల్లివాడ గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలు, పంపిణీ చేసి స్టిక్కర్లు అతికించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సార్ల లింగారెడ్డి, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న ఎంపిపి లలిత కుమారి తదితరులు

ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న పిఒ

రోగులకు సకాలంలో వైద్యం అందించాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : పీహెచ్సీలకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడికి వచ్చే రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. పీహెచ్సీ పరిశరాలను పరిశీలించి, పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, ఎప్పటికప్పుడు పరిశరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పీహెచ్సీ క్వార్టర్స్ తనిఖీ చేసి, నిరుపయోగంగా ఉన్న వాటిని మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. బర్త్ వెయిటింగ్ హాల్‌ను తనిఖీ చేసి అక్కడ గర్భిణులతో మాట్లాడారు. వారికి పలు జాగ్రత్తలు, సూచనలు చేసి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో అధిక కాన్పులు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసు, సీహెచ్‌సి డాక్టర్ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ బాపన్నదొర

పాఠశాలల్లో కోవిడ్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలో రోజురోజుకు కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో కె.బాపన్నదొర ఆదేశించారు. గురువారం అధికారుల బృందం స్థానిక ఏకలవ్య పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, మెనూ, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సిబ్బంది, విద్యార్థులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. హాస్టల్ గదులు, తరగతి గదుల్లో శానిటేజైషన్ చేయించారు. పాఠశాలలో ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉన్నందున సచివాలయ ఏఎన్ఎంను తాత్కాలికంగా విధులు నిర్వహించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె.తాతబ్బాయిదొర, ఉపాధి హామీ ఏపీవో సురేష్, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.